క్లుప్తంగా

వెంకన్న ఆలయంలో ప్రత్యేక పూజలు


ఆలయంలో ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహిస్తున్న ప్రధానార్చకుడు

నక్కపల్లి : భాద్రపద బహుళ ఏకాదశిని పురస్కరించుకుని ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం కొండపై కల్కి అవతారంలో వెలసిన మూల విరాట్‌కు అర్చకస్వామి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. కొండ దిగువన స్వామివారి ఉత్సవమూర్తులకు, క్షేత్ర పాలకుడు వేణుగోపాలస్వామివారికి, ఆండాళ్లమ్మవారి సన్నిధిలో ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ విశేష పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్లను నూతన వస్త్రాలతో అలంకరించారు. అనంతరం విశేష ప్రసాద నివేదన, నీరాజన మంత్రపుష్పాలు, తీర్థగోష్టి నిర్వహించారు.

శౌర్య జాగరణ యాత్ర


రథయాత్రలో ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

రాంబిల్లి : శౌర్య జాగరణ యాత్ర మంగళవారం రాంబిల్లి మండలం చేరుకుంది. యలమంచిలి–గాజువాక బైపాస్ రోడ్డు మీదుగా ఈ రథయాత్ర సాగింది. విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఈ శౌర్య జాగరణ యాత్ర సాగుతుంది. ఈ యాత్రలో భాగంగా భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షుడు సత్యనారాయణ, భజరంగ్‌దళ్ సభ్యులు అనిల్, సూర్య, వసంతవాడ వెంకటేశ్వరరావు, రేఖా నందగోపాల్, పురోహితుడు శేఖర్ పాల్గొన్నారు.

'రైతులను ఆదుకోవాలి'

యలమంచిలి : రాష్ట్రంలో అనకాపల్లి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కర్రి అప్పారావు కోరారు. మంగళవారం యలమంచిలి మండలంలో పెంజెరువు ఆయకట్టు దిగువన ఉన్న వరి పొలాలను రైతులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యలు నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎకరా పొలానికి రూ. 30 వేలు నష్టపరిహారం ప్రభుత్వం రైతులకు అందజేసి ఆదుకోవాలని, పంటల బీమా అన్ని రకాల పంటలకు వర్తింప చేయాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి కూండ్రపు సోమునాయుడు, రైతులు పాల్గొన్నారు.

సెజ్ కార్మికులకు బోనస్ చెల్లించాలి



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాము

అచ్యుతాపురం(అనకాపల్లి): సెజ్ ఫార్మా కార్మికులకు 20 శాతం బోనస్ చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సెజ్‌లోని కర్మాగారాల యాజమాన్యాలు జీతాలు చెల్లించే అంశంపై మాట్లాడుతూ పేమెంట్ ఆఫ్ బోనస్ యాక్ట్ ప్రకారం బోనస్ చెల్లించాలని కోరారు. సీఐటీయూ కన్వీనర్ కె.సోమునాయుడు, రాజు, చంటి, సన్నిబాబు, కర్రి అప్పారావు పాల్గొన్నారు.

ఎండవేడిమికి వర్షంతో ఊరట

రాంబిల్లి: మండలంలో మంగళవారం భిన్న వాతావరణం నెలకొంది. భానుడు భగభగలతో జనం అల్లాడిపోయారు. ఎండ తీవ్రతకు రైతులు, కూలీలు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై తేలికపాటి వర్షం పడింది . ఆ తర్వాత మళ్లీ ఎండ కనిపించింది.

ముమ్మరంగా జగనన్న ఆరోగ్య సురక్ష

వైద్య శిబిరాలకు విశేష స్పందన

పాయకరావుపేట : రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలకు గ్రామాల్లో మంచి స్పందన లభిస్తుంది. ఎంతో కాలంగా వైద్య సేవల కోసం ఎదురు చూస్తున్న బడుగు, బలహీన వర్గాలు ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ఆనందం, సౌలభ్యంగా ఉన్నాయి. స్వయంగా వైద్యులు, వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్య సమస్యలపై సర్వేలు నిర్వహించి, ప్రతి ఇంటిలోను, ప్రతి వ్యక్తిని ఆరోగ్యపరమైన సమస్యలు అడిగి తెల్సుకుని నమోదు చేసుకోవడం జరిగింది. అనంతరం గత నెల 30 నుంచి ప్రతి గ్రామంలో వైద్యులు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. వైద్య శిబిరంలో బీపీ, షుగర్, రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలు, గుండెకు సంబంధించిన పరీక్షలు, స్త్రీలకు సంబంధించిన గర్భకోశ పరీక్షలు, కంటి పరీక్షలు చేసి వైద్యులు సూచనలు, సలహాలు అందిస్తున్నారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం, రోగులకు శస్త్ర చికిత్సలు అవసరమని పరీక్షలు నిర్ధారిస్తే ఆరోగ్య శ్రీ సేవలు వున్న నెట్‌వర్క్ ఆస్పత్రులకు రోగుల్ని పంపించి మెరుగైన వైద్యం చేయించడం ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుని పంపిస్తున్నారు. అదే విధంగా గుండె సమస్యలు, కీళ్ళ సమస్యలు, కంటి సమస్యలు, గర్భకోశ సమస్యలు ఉండి దీర్ఘకాలంగా వైద్యం పొందాలన్న వారికి కూడా తగు సూచనలు, సలహాలు అందిస్తున్నారు. ఇంటువంటి రోగుల్ని పట్టణాల్లో వున్న ఆరోగ్య శ్రీ సేవలు వున్న ఆసుపత్రులకు తరలించే ఏర్పాట్లు కూడా వైద్యులు, అధికారులు చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం మండలంలో గల ఎస్.నర్సాపురం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సుమారు 420 మంది ప్రజలు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు డి.తేజశ్విబాయ్, వి.పద్మజ, పి.కావ్య, వి.అక్షయ కుమార్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. అదే విధంగా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఆధ్వర్యంలో పౌష్టికాహార స్టాల్‌ను ప్రదర్శించి, రోగులకు, గ్రామస్తులకు పౌష్టికాహారం పై అవగాహన కల్పించారు. మెరుగైన ఆహారం తీసుకోవాలని రోగులకు సూచనలు, సలహాలు అందించారు. మండల ప్రత్యేక అధికారి సిహెచ్.లచ్చన్న వైద్య శిబిరాన్ని సందర్శించి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందించారు. ఎంపిడివో ఎ.సాంబశివరావు పర్యవేక్షణలో వైద్య, సచివాలయ సిబ్బంది రోగులకు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పల్లేల స్వామి, ఈవోఆర్‌డీ సిహెచ్ చంద్రశేఖర్, పార్టీ నాయకులు పల్లేల వెంకట్, వైద్య సిబ్బంది ఈవోఆర్‌జె బాలాజీసింగ్ పాల్గొన్నారు.


రోగులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


పాటిపల్లిలో వైద్య శిబిరాన్ని సందర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

దేవవరంలో 651 మందికి వైద్యపరీక్షలు

నక్కపల్లి : మండలంలో దేవవరం గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన వైద్య శిబిరంలో గొడిచర్ల పీహెచ్‌సీకి చెందిన వైద్యులు మురళీకృష్ణారెడ్డి, సుకన్యతోపాటు, మరో ఇద్దరు వైద్యులు విశాఖ నుంచి వచ్చి రోగులకు వైద్య సేవలు అందించారు. దేవవరం, చినరామభద్రపురం, ఒడ్డిమెట్ట గ్రామాల నుంచి శిబిరానికి 651 మంది హాజరై వైద్యసేవలు పొందారు. పీహెచ్‌సీలకు చెందిన టెక్నీషియన్స్ బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, యూరిన్, మలేరియా, డెంగ్యూ పరీక్షలు నిర్వహించారు. జ్వరం దగ్గు, మోకాళ్ల నొప్పులు కంటికి సంబంధించిన వ్యాధులతో బాధపడేవారికి చికిత్సలు అందజేశారు. వలంటీర్లు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, సచివాలయ సిబ్బంది సేవలు అందజేశారు. పంచాయతీవారు తాగునీరు, వసతి ఏర్పాట్లు చేశారు. తహసీల్దార్ అంబేద్కర్, ఎంపీడీవో శ్రీనివాసరావు, మండల పరిపాలనాధికారి సీతారామరాజు, సర్పంచ్ రాఘవకుమారి నర్సింహమూర్తి, మండల పార్టీ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, స్థానిక నాయకులు దండు బలరామరాజు, వేగేశ్న చంటి, పెదరాము శిబిరాన్ని సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. కాగా ఈ శిబిరంలో అంగన్‌వాడీ సిబ్బంది పౌష్టికాహార పదార్థాలతో స్టాల్స్ ఏర్పాటు చేశారు. తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉండే వనరులతో పోషకాహారాన్ని ఏ విధంగా తయారు చేసుకోవచ్చో సూచించారు.


రోగులకు బీపీ చూస్తున్న వైద్య సిబ్బంది

కోటవురట్ల: ఏ కుటుంబానికి ఆరోగ్యపరమైన సమస్యలు ఉండకూడదనే లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ అన్నారు. పందూరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం ప్రత్యేకాధికారి సందర్శించారు. ప్రభుత్వం లక్ష్యం నెరవేరేందుకు అందరూ చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. సర్పంచ్ చీకట్ల జగదీష్ మాట్లాడుతూ సీఎం జగనన్న ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఇస్తూ ప్రజల వద్దకే వైద్య సేవలను పంపిస్తున్నారన్నారు. ఈ శిబిరాలలో 7 రకాల వైద్య పరీక్షలతో పాటు 14 రకాల వ్యాధులకు చికిత్స అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, వైద్యులు సంతోష్‌కుమార్, సుదీప్, ఎంపీహెచ్‌ఈవో గోవిందరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కరరావు, వెంకట్, నారాయణరావు పాల్గొన్నారు.


పౌష్టికాహార స్టాల్‌ను ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ సిబ్బంది

ఎస్.రాయవరం : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి ఒక్కరికి వైద్య సేవలు అందుతున్నాయని ఎంపీడీవో రామచంద్రమూర్తి అన్నారు. పెట్టుగోళ్లపల్లి గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు సుభాన్, వాసంతి, జి.స్వాతిలక్ష్మి వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 355 మంది రోగులు వైద్య పరీక్షలు చేయించుకోగా, 24 మందిని ఉన్నత వైద్యం కోసం విశాఖలోని ఆస్పత్రులకు తరలించారు. ఈ వైద్య శిబిరానికి స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు వియ్యపు వరహాలరావు, చొప్పా రాజు సహాయ సహకారాలు అందించారు.

పాటిపల్లిలో ఆరోగ్య సురక్ష సేవలు

మునగపాక : ప్రజల ఆరోగ్యం కోసం నిత్యం తపించే నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు పేర్కొన్నారు. పాటిపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన సందర్శించారు. అలాగే వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, సర్పంచ్ ఆడారి కృష్ణవేణి త్రిమూర్తులు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, నారాయుడుపాలెం సర్పంచ్ కారుకొండ వెంకటి, సచివాలయాల మండల కన్వీనర్ గణేష్, సచివాలయ కన్వీనర్లు శ్రీనివాసరావు, జగదీష్,భీశెట్టి దనశ్రీను,ఎంపీటీసీ నాగేశ్వరరావు, ఎంపీడీవో మన్మథరావు,ఈవోఆర్డీ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.


రోగుల కోసం ఏర్పాటు చేసిన మందుల స్టాల్


దేవవరంలో రోగులను పరీక్షిస్తున్న మండల వైద్యాధికారి డాక్టర్ మురళీకృష్ణారెడ్డి


దేవవరంలో అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన స్టాల్స్ పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు


అంగన్‌వాడీ స్టాల్‌ను పరిశీలిస్తున్న సర్పంచ్ జగదీష్


పెట్టుగోళ్లపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం


పాటిపల్లిలో ఓపీ నమోదు చేసుకుంటున్న దృశ్యం


రోగి నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న వైద్యురాలు


పాటిపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి హాజరైన రోగులు


పందూరు వైద్య శిబిరంలో వైద్యసేవలను పర్యవేక్షిస్తున్న ప్రత్యేకాధికారి ఉదయశ్రీ

గ్రామాభివృద్ధికి సహకరించండి

మునగపాక : మునగపాక గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. మునగపాక సంతబయిల మార్కెట్‌యార్డులో లారస్ నిధులతో నిర్మిస్తున్న షెడ్లను ఆయన మంగళవారం పరిశీలించారు.

ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మార్కెట్‌లో క్రయ విక్రయాలకు అనువుగా షెడ్లు నిర్మించేందుకు పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. ఇందుకు సహకరించిన కంపెనీ యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఉప సర్పంచ్ పెంటకోట సత్యనారాయణ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు టెక్కలి వీర కొండలరావు, మాజీ వార్డు సభ్యుడు ఆడారి గోపి పాల్గొన్నారు.


మార్కెట్‌లోని షెడ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

ఈఆర్‌వో కార్యాలయం ఏర్పాటుకు వినతి

యలమంచిలి : నియోజకవర్గ ఎలక్టోరల్ (ఈఆర్‌వో) కార్యాలయాన్ని యలమంచిలి పట్టణంలో ఏర్పాటు చేయాలని అఖిలపక్ష నాయకులు కోరారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రాణి అమ్మాజీకి వైయస్సార్‌సీపీ, టీడీపీతో పాటు పలు పార్టీలకు చెందిన అఖిలపక్ష నాయకులు ఎన్నికల ప్రక్రియపై వినతి పత్రం అందజేశారు. గతంలో ఎన్నికలకు సంబంధించి సమీక్షలు సమావేశాలు, ఓటరు నమోదు ,రిజిస్ట్రేషన్ మొదలగు అన్ని విధులు యలమంచిలిలో జరిగేవని, కానీ ప్రస్తుతం అచ్యుతాపురం మండల కేంద్రంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్ఞానవేణి ఆధ్వర్యంలో కార్యాలయం కొనసాగుతుందని తెలిపారు. తిరిగి యలమంచిలిలో ఈఆర్‌వో కార్యాలయాన్ని యథావిధిగా కొనసాగించాలని తహసీల్దార్‌కు విన్నవించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, రూరల్ వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, కోడిగుడ్డు రమణ, టీడీపీ నాయకులు రమణబాబు, జనసేన పార్టీ నాయకులు బొద్దపు శ్రీను, సోమునాయుడు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రక్రియపై తహసీల్దార్ రాణి అమ్మాజీకి వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్ష నాయకులు

ఐరన్ పోషకాలతో బాలికల్లో రక్తహీనత నివారణ

నక్కపల్లి : బాలికల్లో ఐరన్ పోషకాలు కలిగిన పదార్థాలు, ఆహారాన్ని తీసుకోవడం ద్వారా రక్త హీనత సమస్యల నుంచి బయట పడొచ్చని మండల వైద్యాధికారి డాక్టర్ జి.మురళీ కృష్ణారెడ్డి అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం దేవవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలికలకు రక్తహీనత ఇతర సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యుక్త వయసు వచ్చే బాలికల్లో రక్త హీనత సమస్యలు ప్రారంభమవుతాయన్నారు. ఇటువంటి సమస్యల నుంచి బాలికల ఆరోగ్యాన్ని రక్షించేందుకు ప్రభుత్వం పదేళ్లు దాటిన పిల్లలకు పాఠశాలల్లో ఐరన్ టాబ్లెట్లు ఉచితంగా పంపిణీ చేస్తోందన్నారు. ఈ మాత్రలతో పాటు, ఐరన్ పోషకాలు ఉండే ఆహార పదార్ధాలను తీసుకోవాలన్నారు. ఆకు కూరలు, పప్పు దినుసులు, రాగి జావ, చిక్కీలు, బెల్లంతో తయారు చేసిన పదార్థాలను తీసుకోవాలన్నారు. మహిళా వైద్యురాలు డాక్టర్ సుకన్య మాట్లాడుతూ ఆడపిల్లలు తమ వ్యక్తిగత ఆరోగ్య సమస్యలను ఉపాధ్యాయుల ద్వారా ఏఎన్‌ఎం, ఆశావర్కర్ల దృష్టికి తీసుకు వస్తే తాము పాఠశాలకు వచ్చిన నివారణ మార్గాలు తెలియజేస్తామన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల ప్రధాన ఉద్దేశ్యం ఇదేనన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ప్రధానోపాద్యాయుడు వేమగిరి నూకరాజు, ఉపాధ్యాయులు దేవర నర్సింహమూర్తి, కార్యదర్శి సాయిలక్ష్మి,మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు జగన్నాథపురంలో ఆరోగ్య సురక్ష

అచ్యుతాపురం(అనకాపల్లి): జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని అచ్యుతాపురం మండలంలోని ఎం.జగన్నాథపురం గ్రామంలో బుధవారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. ఈ శిబిరానికి సచివాలయం పరిధిలోని వారంతా వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పీహెచ్‌సీ వైద్యులతో పాటు, స్పెషలిస్టు వైద్యులు కూడా వారి సేవలందిస్తారని ఆమె తెలిపారు.

గుంటవానిపాలెంలో...

మునగపాక: మండలంలోని గంటవానిపాలెంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరుగుతుందని ఎంపీడీవో మన్మథరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరం జరుగుతుందన్నారు. ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రుక్మిణీపురంలో...

యలమంచిలి : మండలంలో పోతిరెడ్డిపాలెం సచివాలయం పరిధి రుక్మిణీపురం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందని ఎంపీడీవో అప్పలనాయుడు తెలిపారు. ఈ ఆరోగ్య శిబిరంలో ప్రతి ఒక్కరూ తమ దీర్ఘకాలిక సమస్యలు వివిధ 7రకాల వైద్య పరీక్షలు ఈ శిబిరంలో చేస్తారని ప్రతి ఒక్కరూ ఈ వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు.

వైద్యరంగంలో నూతన సంస్కరణలు

- యలమంచిలి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు
- జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

యలమంచిలి : రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం వైద్య రంగంలో నూతన సంస్కరణలు తీసువచ్చి ప్రతి గ్రామానికి, పట్టణాలకు వైద్య సేవలు అందేలా చూస్తున్నారని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు అన్నారు. మండలంలో పులపర్తి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య శిబిరాన్ని డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మతో కలసి ఆయన పరిశీలించారు. ప్రభుత్వాసుపత్రుల్లో 66 వేల వైద్యులు, సిబ్బంది పోస్టుల ఖాళీలు భర్తీ చేశారని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బోదెపు గోవింద్, జెడ్పీటీసీ సంధ్యారాణి రాము, మండల వైయస్సార్‌సీపీ రూరల్ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, పట్టణ వైయస్సార్ సీపీ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, ఎంపీడీవో అప్పలనాయుడు, తహసీల్దార్ రాణీ అమ్మాజీ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాంబిల్లి : ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే జగనన్న ధ్యేయమని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు(కన్నబాబు) అన్నారు. వాడనర్సాపురం గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించి వైద్య సేవలపై ఆరా తీశారు. జగనన్న పాలనలో పీహెచ్‌సీల్లో ఇద్దరేసి వైద్యులను నియమించడం జరిగిందన్నారు. పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో వుంటున్నాయన్నారు. జెడ్పీటీసీ ధూళి నాగరాజు, ఎంపీపీ శిరీషశ్రీనుబాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్, మండల సచివాలయ కన్వీనర్ రామకృష్ణ, ఎంపీడీవో కొండలరావు, తహసీల్ధార్ భాగ్యవతి పాల్గొన్నారు.

అచ్యుతాపురం(అనకాపల్లి): పేద,బడుగు బలహీన వర్గాలకు సంపూర్ణ ఆరోగ్యం కలిగేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, దీనిలో భాగంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోందని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు అన్నారు. అచ్యుతాపురం మండలంలోని చోడపల్లి సచివాలయం పరిధిలో ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య శిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, జెడ్పీటీసీ లాలం రాంబాబు,కోఆప్షన్ జెడ్పీటీసీ నర్మాల కుమార్, పార్టీ నాయకులు కోన బుజ్జి, దేశంశెట్టి శంకర్‌రావు, వడిశెల శ్రీనివాసరావు, పిన్నమరాజు వాసు, ధర్మిరెడ్డి నాయుడుబాబు, గొర్లె నూకరాజు, అడిగర్ల దేముడు, పంచదార్ల పైడిరాజు పాల్గొన్నారు.


పులపర్తి గ్రామంలో వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు


వాడనర్సాపురంలో వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

రేపు మునగపాకలో రెండు నాటిక ప్రదర్శనలు

మునగపాక : మండల కేంద్రంలో ఈ నెల 12న రెండు నాటిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆర్‌ఈసీఎస్ మాజీ చైర్మన్ పెంటకోట జనరాజ్‌దాస్ జయంతి సందర్భంగా గ్రామీణ యువజన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నాటిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. మునగపాక నందీశ్వర తులసీ కళావేదికపై రాత్రి 7గంటలకు హైదరాబాద్‌కు చెందిన కళాంజలి వారితో 'రైతే రాజు' నాటిక ప్రదర్శన జరుగుతుంది. కంచర్ల సూర్యప్రకాష్ రచన అందించగా కొల్లా రాధాకృష్ణ దర్శకత్వం వహిస్తారు. ద్వితీయ ప్రదర్శనగా హైదరాబాద్‌కు చెందిన కళాంజలి వారి 'మనిషి మంచోడే' నాటిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ నాటికకు కాటా సుబ్బారావు రచన చేయగా జెట్టి హరిబాబు దర్శకత్వం వహించనున్నారు. రెండు నాటిక ప్రదర్శనలను విజయవంతం చేయాలని గ్రామీణ యువజన సాంస్కృతిక సంస్థ కన్వీనర్ సూరిశెట్టి రాము కోరారు.

సమస్యల పరిష్కారానికి ఆర్టీసీ కార్మికుల ధర్నా

అనకాపల్లిటౌన్: ప్రజా రవాణా శాఖ(ఆర్టీసీ) విజయనగరం జోన్ పరిధిలో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రెండు రోజుల పాటు మధ్యా హ్న భోజన విరామ సమయంలో ధర్నాలు, ఎర్రబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చినట్లు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిపో అధ్యక్షుడు ఏఎస్ రావు తెలిపారు. డిపో గ్యారేజీ గేటు వద్ద మంగళవారం భోజన విరామ సమయంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 జనవరిలో విడుదల చేసిన సర్క్యులర్‌కి విరుద్ధంగా సీ అండ్ టీ, యాక్సిడెంట్ కేసులలో చేస్తున్న బదిలీలను నిలిపేయాలన్నారు. మూడేళ్ల ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లింపు, జీతాలతో ఓటీ, నైట్ అవుట్, డే అవుట్, నైట్ షిఫ్టుల భత్యాలను ప్రతినెలా చెల్లించాలని కోరారు.


సమస్యలు పరిష్కరించాలని డిపో గేటు వద్ద ధర్నా చేస్తున్న ఎన్‌ఎంయూఏ కార్మికులు

రోడ్డుపై ఆక్రమణల తొలగింపు

అనకాపల్లిటౌన్: స్థానిక మెయిన్‌రోడ్డులో రహదారిని ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న దుకాణాలను తొలగించినట్లు జెడ్పీ ఎస్.వెంకటరమణ మంగళవారం తెలిపారు. అనకాపల్లి జిల్లా కేంద్రంగా ఏర్పడినప్పటి నుంచి ట్రాఫిక్ సమస్య పెరిగిందన్నారు. పట్టణానికి గ్రామీణ ప్రాంతాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారని దీంతో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రజలు, దుకాణ యజమానులు సహకరించాల్సిందిగా కోరారు.

ముమ్మరంగా ఈకేవైసీ


దిమిలిలో ఈకేవైసీ ప్రక్రియను పరిశీలిస్తున్న ఏవో సుమంత

రాంబిల్లి : రైతుల ఈకేవైసీ ప్రక్రియను మండలంలో మంగళవారం ముమ్మరంగా నిర్వహించారు. ఈకేవైసీ ప్రక్రియకు మంగళవారం తుది గడువు కాగా మరో రోజు పొడిగించారు. దిమిలిలో నిర్వహిస్తున్న ఈకేవైసీ ప్రక్రియను ఏవో సి. సుమంత పరిశీలించారు. వీఏఏ మేఘన, ఎంపీఈవో రామారావులకు ఆమె సూచనలు చేశారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు ఆన్‌లైన్ నిలిచిపోతుందని, ఈ లోగా ఈకేవైసీ పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నామని ఏవో తెలిపారు.